క్లుప్తంగా

మహాభారత యజ్ఞానికి రూ.20 వేల విరాళం



నగదును అందజేస్తున్న నేతలు

సోమల: మండలంలోని సోమల భారతం మిట్ట లో మహా భారత యజ్ఞం నిర్వహణకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గురువారం రూ.20 వేలను విరాళంగా అందించారు. ఈ నగదును పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్వరరావు, ఎంపీపీ ఈశ్వరయ్య నిర్వాహకులకు అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు వేముల హరినాథ్, నేతలు గంగాధరం, శ్రీరాములు, నాగభూషణంరెడ్డి, రమణ, ప్రభాకర, సాంబయ్య, వీవీ రమణ, సుబ్బుయాదవ్, ఆటోప్రసాద్, షేక్ బాషా, పాలేటి పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని మతుకువారిపల్లె ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను గురువారం ఎంపిడీఓ సుగుణమ్మ పరిశీలించారు. మరుగు దొడ్ల నిర్మాణాలను త్వరిత గతిన పూర్తి చేయాలని సూచించారు. పాఠశాలల పునః ప్రారంభం నాటికి అందుబాటులో ఉండాలన్నారు. ఉపాధి ఏపీఓ సౌకత్అలీ, ఈసీ కృష్ణ పాల్గొన్నారు.

సంప్రదాయ కళలను పరిరక్షిద్దాం



కళాకారుల కోలాట ప్రదర్శన

పలమనేరు:అంతరించిపోతున్న సంప్రదాయ కళలను కాపాడుకోవాల్సిన అవసరం అందరిపై ఉందని మండలంలోని కాబ్బల్లికి చెందిన కోలాటాల కళా బృందం గురువు సుబ్రమణ్యం రెడ్డి పేర్కొన్నారు. బోడిరెడ్డిపల్లెకు చెందిన వేణుగోపాలస్వామి భజన బృందం కళాకారులు గురువారం పట్టణంలోని ఆలయాల వద్ద కోలాటాల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంప్రదాయ కళల పరిరక్షణ సంస్థ పేరిట దాతల సహకారంతో తాము కోలాటం నేర్చుకునే వారికి శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. పట్టణంలో ఈనెల 14న జరుగనున్న జాతర సందర్భంగా కోలాట ప్రదర్శన నిర్వహించినట్టు పేర్కొన్నారు. సీనియర్ కళాకారిణి హేమలత బృందం పాల్గొంది.

ఇసుక ట్రాక్టర్ సీజ్



గంగవరం:కౌండిన్యా నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను గురువారం గంగవరం పోలీసులు సీజ్ చేశారు. గంగవరానికి చెందిన శ్రీనివాసులు ఎలాంటి అనుమతులు లేకుండా కౌండిన్యా నది నుంచి ట్రాక్టర్‌లో ఇసుక లోడ్ చేసి తరలిస్తుండగా కూర్నిపల్లె క్రాస్ వద్ద పట్టుకున్నట్టు ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసినట్టు పేర్కొన్నారు.

విధులకు ఆటంకం : వ్యక్తిపై కేసు

సోమల: అధికారుల విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు..మండలంలోని ఆవులపల్లె పంచాయతీ మధురమలై అటవీ ప్రాంత పరిధిలో అటవీ శాఖ అధికారులు బుధవారం గస్తీ నిర్వహించారు. ఈసందర్భంగా ఇదే పంచాయతీ మల్లేశ్వరపురానికి చెందిన స్వతంత్ర నాయుడు దౌర్జన్యం చేసి విధులకు ఆటకం కలిగించాడని గురువారం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ దేవేంద్ర పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎస్ఐ మారుతి తెలిపారు.

నేడు జాతర పొంగళ్లు

చిత్తూరు రూరల్: నగరంలో ఈ నెల 16,17 తేదీల్లో నిర్వహించనున్న నడివీధి గంగజాతరను పురస్కరించుకుని శుక్రవారం ప్రజలు పొంగళ్లు పెట్టనున్నారు. ప్రధానంగా పొన్నియమ్మ ఆలయం, దుర్గమ్మ ఆలయం, శక్తిమారియమ్మ ఆలయం, ముత్యాలమ్మ ఆలయం తదితర ఆలయాల వద్ద భక్తులు పొంగళ్లు పెట్టేందుకు వీలుగా ఏర్పాట్లు పూర్తి చేశారు.

టెండర్ల ఆహ్వానం

బంగారుపాళెం: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో క్యాంటీన్ నిర్వహణ, చెత్త తొలగింపునకు టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ నారే సోమశేఖర్, కార్యదర్శి వెంకటరమణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పూర్తి చేసిన టెండర్లను ఈ నెల 16వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు మార్కెట్ కమిటీ కార్యాలయంలో సమర్పించాలని కోరారు. క్యాంటిన్, చెత్త నిర్వహణకు సంబంధించి వేర్వేరుగా డిమాండ్ డ్రాఫ్టులను కార్యదర్శి, వ్యవసాయ మార్కెట్ కమిటీ, బంగారుపాళెం పేరు మీద చెల్లించాలని తెలిపారు. వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

గృహసారథులు, కన్వీనర్లే కీలకం



సోమల: సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి, పక్కన ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి



రొంపిచెర్ల : హాజరైన గృహ సారథులు, వలంటీర్లు, ప్రజా ప్రతినిధులు

- ప్రభుత్వంపై దుష్ప్రచారాన్ని తిప్పికొడదాం
- చంద్రబాబుకు అబద్ధాలు రాసే పత్రికల అండ
- టీడీపీకి ఓట్లు అడిగే పరిస్థితి లేదు
- ఓట్లు ధైర్యంగా అడిగేలా జగన్‌మోహన్‌రెడ్డి పాలన
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సోమల/రొంపిచెర్ల: రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా చేసుకునేందుకు గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు సైనికుల్లా పనిచేయాలని రాష్ట్ర అటవీ, విద్యుత్ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం సోమలలో తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డితో కలిసి, రొంపిచెర్లలో నాగిరెడ్డి కల్యాణ మండపంలో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లతో జరిగిన సమావేశంలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. చంద్రబాబు తన ప్రభుత్వ హయాంలో గోరంత పని చేసి కొండంత ప్రచారం చేసుకున్నారని ఆరోపించారు. ఆయనకు అబద్ధాలు రాసే పత్రికలు, నిజాలు దాచిపెట్టే టీవీ చానెల్స్ ఉన్నాయన్నారు. మనం చేసిన మంచి పనులను చెప్పుకోవడానికి మౌత్ కేన్వాసింగ్ మాత్రమే సాధనమని తెలిపారు. మీడియా ఇచ్చే ప్రచారం కన్నా మనకు ఎక్కువగా ప్రచారం జరుగుతుందన్నారు. 600 హామీలు ఇచ్చి ఎన్నికలు పూర్తయ్యాక మోసం చేసిన ఘనత చంద్రబాబుదని ఎద్దేవా చేశారు. 2014 మేనిఫెస్టోలో రైతు రుణమాఫీ పెట్టాలని తాను జగన్‌మోహన్‌రెడ్డిని కోరినా, ఆయన తిరస్కరించారని, చేయలేని పనులు చేస్తానని హామీ ఇవ్వలేనని చెప్పారన్నారు. నియోజక వర్గంలో ఎప్పుడు జరగని అభివృద్ధి నేడు జరుగుతుందన్నారు. ప్రతి గ్రామానికి తారు రోడ్లు, సీసీ రోడ్లను వేశామని తెలిపారు. అలాగే కల్లూరు–రొంపిచెర్ల, డబ్బుల్ రోడ్డు పనులు పూర్తి చేశామని తెలిపారు. రూ.20 కోట్లతో మల్లెలక్రాస్–రంగన్నగారిపల్లె రోడ్డు వరకు డబుల్ రోడ్డుకు నిధులు మంజూరు చేశామని తెలిపారు.

మేనిఫెస్టో పవిత్ర గ్రంథం

2019 మేనిఫెస్టోను వైఎస్సార్‌సీపీ ఒక పవిత్ర గ్రంథంలా భావించిందన్నారు. మూడు సంవత్సరాల్లోనే 98.44 శాతం హామీలను నేరవేర్చిందన్నారు. మరి చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు ఈ పథకాలను ఎందుకు ప్రవేశ పెట్టలేదని ప్రశ్నించారు. ప్రతి ఇంటికి వెళ్లి గర్వంగా మాకు ఓటు వేయండని అడిగేలా జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని తెలిపారు. మనం ప్రతి ఇంటిని సందర్శించి వారికి అందిన లబ్ధిని వివరించాలని కోరారు. గృహసారథులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు ఇది ఒక బాధ్యతగా తీసుకుని టీడీపీ నేతలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సూచించారు. ఏపీలో తన అవసరం చాలా నియోజక వర్గాలకు ఉందని, దీనిని దృష్టిలో పెట్టుకుని తన వంతుగా గ్రామాల్లో అభివృద్ధి పథకాలపై ప్రచారం కల్పించాలన్నారు. పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు జింకా చలపతి, రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, టీటీడీ బోర్డు మెంబర్ పోకల అశోక్‌కుమార్, ఎంపీపీ ఈశ్వరయ్య, మండల అధ్యక్షుడు గంగాధరం, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్వరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మళ్లీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డే

ఏపీలో ఎన్నికలు ఎప్పుడు జరిగిన మళ్లీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డేనని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. రొంపిచెర్ల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఏపీలో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాలని ప్రజలు ఎదురు చూస్తున్నారని తెలిపారు. పుంగనూరు నియోజక వర్గంలో ఇంటింటికీ తాగునీరు ఇచ్చేందుకు రూ. 2400 కోట్లతో టెండర్లు పిలిచామని అన్నారు. సోమల మండలంలో నిర్మిస్తున్న ప్రాజెక్టు ద్వారా పీలేరు, రొంపిచెర్ల మండలాలకు కూడా సాగు నీరు తీసుకుని వస్తామని చెప్పారు. ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రెడ్డీశ్వర్ రెడ్డి, సింగిల్‌విండో చైర్మెన్ దేవులపల్లె హరినాథరెడ్డి, నాయకులు చెంచురెడ్డి, డాక్టర్ శ్రీనాథ్, కోటా వెంకటరమణ, కరీముల్లా, ఎంపీటీసీ సభ్యులు నూలు రెడ్డెప్ప, రహీమబీ, విజయశేఖర్, సర్పంచ్‌లు ఇబ్రహీంఖాన్, నాగిరెడ్డి, హేమలత, రమణయ్య, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తులు

సదుం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో ఇంటర్ ఫస్టియర్ ప్రవేశానికి పదవ తరగతి పాస్ అయిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపల్ వెంకటనాథరెడ్డి గురువారం తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపుల్లో ఇంగ్లిష్, తెలుగు మీడియం అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో మెరుగైన బోధన అందిస్తామన్నారు. విద్యార్థుల తల్లి దండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

16న పరికరాల వేలం

పుంగనూరు: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో మూలనపడ్డ పరికరాలను ఈనెల 16న వేలం వేయనున్నట్లు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జశ్వంత్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఆస్పత్రి కమిటీ చైర్మన్ డాక్టర్ శరణ్‌కుమార్ ఆధ్వర్యంలో పాత వస్తువులను బహిరంగ వేలం నిర్వహిస్తామన్నారు. ఆసక్తి ఉన్న వ్యాపారులు వస్తువులను పరిశీలించుకుని నిబంధనల మేరకు వేలంపాటలో దక్కించుకోవచ్చని కోరారు.

ఏనుగులున్నాయ్.. అడవిలోకి వెళ్లద్దు

కుప్పం: తమిళనాడు సరిహద్దుల్లో ఏనుగుల గుంపు సంచరిస్తోందని, ఏ సమయంలోనైనా మన రాష్ట్ర సరిహద్దుల్లోకి వచ్చే అవకాశం ఉందని అటవీశాఖ అధికారి మధుసూదన్ రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఏనుగుల సంచారాన్ని దృష్టిలో ఉంచుకుని కుప్పం మండల పరిధిలోని కూనూరు, పైపాళ్యం, మెట్లచేను పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. మేకలు, పశువులు మేపేందుకు అడవిలోకి వెళ్లి ఇబ్బందులు పడవద్దని సూచించారు. ఏనుగుల గుంపు సంచరించరిస్తున్నట్లు తెలిస్తే వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. అటవీ సరిహద్దు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు.

పథకాల అమలులో దేశానికే ఆదర్శం



సంక్షేమ లబ్ధి బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ,జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: సంక్షేమ పథకాల అమలులో దేశానికే తమ ప్రభుత్వం ఆదర్శంగా నిలుస్తోందని ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు. గురువారం మండలంలోని పెద్ద రాంపల్లె, బైరుపల్లెలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. 291 ఇళ్లకు వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలోనే ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని పేర్కొన్నారు. అర్హతే ప్రమాణికంగా కుల, మత, వర్గ, పార్టీలకతీతంగా సంక్షేమ ఫలాలు అందిస్తున్నట్లు తెలిపారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థతో పథకాల లబ్ధిని పారదర్శకంగా ఇళ్ల వద్దకే అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల నుంచి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక ప్రతి పక్ష నాయకులు బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని మండి పడ్డారు. ఎవరు ఎన్ని దుష్ప్రచారాలు చేసినా ప్రజలు నమ్మే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. అనంతరం ఇళ్లు, పింఛన్లు మంజూరు చేయాలని, విద్యుత్‌లైన్లు మార్చాలని అందిన సమస్యలపై వెంటనే పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.

రూ.కోటి 30 లక్షలతో సిమెంటు రోడ్డు

గతంలో ఎన్నికలకు రెండు నెలల ముందు పాముగానిపల్లె, బైరుపల్లె రోడ్డుకు టీడీపీ నాయకులు మొక్కుబడిగా శంకుస్థాపన చేసి గాలికి వదిలేశారని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.కోటి 30 లక్షలతో సిమెంటు రోడ్డు నిర్మించిందని తెలిపారు. ఏఎంసీ చైర్మన్ హేమంత్, ఎంపీపీ యువరాజ్, జేసీఎస్ మండల కన్వీనర్ కిషోర్ కుమార్, పీఏసీఎస్ చైర్మన్ శ్రీరాములరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు మురుగేష్, సర్పంచ్ నీలమ్మ, రెస్కో డైరెక్టర్ భూపతి, నాయకులు శంకర్‌రెడ్డి, ఇంద్రేష్, మురళి, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రేపటి నుంచి కావమ్మ తిరునాళ

సదుం: మండలంలోని భట్టువారిపల్లె కావమ్మ, మారయ్య ఆలయంలో శుక్రవారం నుంచి తిరునాళ జరుగుతుందని బెస్త సంఘం నాయకులు తెలిపారు. 12న అభిషేకం, ఆరాధన, జంగాల కథ, 13న కల్యాణోత్సవం, జంగాలకథ, సారె పంపిణీ, 14న జంగాల కథ, అగ్నిగుండ ప్రవేశం ఉంటుందన్నారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

15న మామిడి ఫల సాయం వేలం

పలమనేరు: పలమనేరు ఫారెస్ట్ రేంజి పరిధిలోని కీలపట్ల బీట్ 7/7,609/1,788/2,288/3 తదితర సర్వే నంబర్లలోని 98 ఎకరాల భూమిలో 158 మామిడి చెట్ల ఫలసాయాన్ని ఈనెల 15న స్థానిక ఎఫ్ఆర్వో కార్యాలయం వద్ద బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఎఫ్ఆర్వో నయీమ్ అలీ తెలిపారు. ఆసక్తి ఉన్నవారు రూ.5వేలు ధరావతు చెల్లించి వేలంపాటలో పాల్గొన వచ్చని గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో బాబా

రామకుప్పం: మండలకేంద్రంలోని షిర్డి సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఉదయం ప్రత్యేక అభిషేక పూజలు, విశిష్ట అలంకరణలు జరిగాయి. రాత్రి హారతి పూజలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భజనలు చేశారు. తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

15 నుంచి గడప గడపకు మన ప్రభుత్వం

రామకుప్పం: మేజర్ గ్రామపంచాయతీ రామకుప్పం పరిధిలోని గ్రామాల్లో ఈనెల 15వ తేదీ నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్సీ భరత్ పాల్గొంటారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ తొలిరోజు మిట్టపల్లెలో ఉదయం 7 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఇంటింటికీ ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరిస్తారని, సమస్యలను తెలుసుకుంటారని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు, కార్యకర్తలుపాల్గొనాలని కోరారు.

నిరంతరం ప్రజల్లో ఉండే నాయకుడు..



సదుం: మట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

సదుం: నిరంతరం ప్రజల్లో, ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ప్రధాన్యం ఇచ్చే నాయకుడిగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నిలిచిపోతారని చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన గృహ సారథులు, వలంటీర్లు, అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో గత ఎన్నికల్లో 14 నియోజకవర్గాల్లో 13 చోట్ల గెలిపించడంలో ఆయన ప్రధాన పాత్ర వహించారని తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏబాధ్యత అప్పగించినా దాన్ని విజయవంతంగా నెరవేరుస్తున్నారని చెప్పారు. గ్రామ గ్రామాన ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉంటూ, వారి సమస్యలను పరిష్కరించేందుకు సొంత నిధులను సైతం వెచ్చించే ఘనత ఆయనకే దక్కుతుందని తెలిపారు. నియోజకవర్గ ప్రజల ఆశీస్సులు ఆయనకు ఎప్పుడూ ఉండాలని కోరారు.

మండల ప్రజల రుణం తీర్చుకోలేనిది

సదుం మండల ప్రజల రుణం తీర్చుకోలేనిదని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి తెలిపారు. తమ కుటుంబంలో పలు పదవులు దక్కేందుకు వారి అభిమానమే కారణమన్నారు. ఎంతటి కష్ట కాలంలోనైనా తమ వెన్నంటే ఉన్నారని చెప్పారు. ఎన్నికల సమయంలోను తంబళ్లపల్లెకు వచ్చి తమకు మద్దతుగా ప్రచారం నిర్వహించారని గుర్తు చేసుకున్నారు.

నూతన వధూవరులకు మంత్రి పెద్దిరెడ్డి ఆశీర్వాదం



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

సదుం: మండలంలోని జాండ్రపేటకు చెందిన అన్వాజ్ వివాహం మోనాతో ఇటీవలే జరిగింది. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గురువారం వారి ఇంటికి వెళ్లి నూతన వధూవరులను ఆశీర్వదించారు. వివాహ శుభాకాంక్షలు తెలిపారు. మంత్రికి వారు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, వక్ఫ్‌బోర్డు చైర్మన్ అమ్ము తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మకు సారె సమర్పణ



పసుపు నీళ్ల కలశాలతో మహిళల ఊరేగింపు



ఆలయంలో సారె సమర్పణ

పలమనేరు: గంగజాతరను పురస్కరించుకుని పట్టణానికి చెందిన మేదర కులస్తులు గురువారం గంగమ్మకు సారె సమర్పించారు. మహిళలు సారె, పసుపునీళ్ల కలశాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అనంతరం అభిషేక పూజలు, అలంకరణలు జరిగాయి. డప్పు వాయిద్యాలు, బళ్లారి డ్రమ్ములు, బుట్టబొమ్మల ప్రదర్శనలు అలరించాయి. అన్నదానం చేశారు. గంగవరం జెడ్పీటీసీ సభ్యురాలు పార్వతి, వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రప్ప, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అల్లూరి విగ్రహం ఏర్పాటుకు నేడు భూమి పూజ

పుంగనూరు: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుమతి ఇచ్చారని, శుక్రవారం భూమి పూజ చేస్తామని క్షత్రియ సంఘ నాయకులు, జెడ్పిటీసీ సభ్యుడు దామోదర్‌రాజు తెలిపారు. దామోదర్‌రాజు, సతీష్‌కుమార్‌రాజు, నవీన్‌కుమార్‌రాజు ఆధ్వర్యంలో క్షత్రియ సంఘ నాయకులు గురువారం తిరుపతిలో మంత్రి పెద్దిరెడ్డిని కలిశారు. పుంగనూరు పట్టణంలోని చిత్తూరు బైపాస్ సర్కిల్‌లో విగ్రహం ఏర్పాటు చేసేందుకు అనుమతి కోరారు. అందుకు మంత్రి అంగీకరించారు. దామోదర్ రాజు మాట్లాడుతూ శుక్రవారం భూమి పూజా కార్యక్రమాలు నిర్వహించి, విగ్రహాన్ని త్వరలోనే ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్‌రాజు, భక్తవత్సలరాజు, శ్రీనివాసులురాజు, రామచంద్రరాజు, చంద్రశేఖర్ రాజు, ఈశ్వర్‌రాజు, మంజు, శివ, నాగ, పట్టాభి తదితరులు పాల్గొన్నారు.

వెంకట్రమణ మృతికి మంత్రి సంతాపం

పుంగనూరు పట్టణ బలిజ సంఘం అధ్యక్షుడు జయరాం తండ్రి వెంకట్రమణప్ప (70) బుధవారం మృతి చెందారు. విషయం తెలియగానే మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి, పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. వెంకట్రమణప్ప సేవలను కొనియాడారు. నివాళులర్పించిన వారిలో బలిజ సంఘం నాయకులు నానబాలగణేష్, పూలత్యాగరాజు, కొండవీటి నరేష్, మిద్దింటి కిషోర్, బండకుమార్ తదితరులు ఉన్నారు.

ఉద్యోగ అవకాశాలపై అవగాహన



పోటీల్లో గెలుపొందిన కేడెట్‌ను అభినందిస్తున్న కల్నల్ అజయ్ బస్‌నెట్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని కృష్ణవేణి జూనియర్ కళాశాలల ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఎన్‌సీసీ క్యాంప్‌లో విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. గురువారం నిర్వహించిన ఈ సదస్సులో కల్నల్ అజయ్ బస్‌నెట్ మాట్లాడుతూ 35 ఆంధ్ర బెటాలియన్ క్యాంపు నిర్వహించి విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగ అవకాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు చెప్పారు. ఎన్‌సీసీ-సీ సర్టిఫికెట్ పొందిన కేడెట్లకు ఎస్ఎస్‌బీలో ఆర్మీ అధికారులు అయ్యే అవకాశాలపై సూచనలు ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం కేడెట్లకు పలు క్రీడా పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరచిన వారికి బహుమతులు, సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు ప్రసాద్‌రెడ్డి, రమేష్, నవీన్ పాల్గొన్నారు.

హెల్త్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలి

చిత్తూరు అర్బన్: న్యాయవాదుల కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన హెల్త్ కార్డులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర న్యాయవాద మండలి సభ్యులు నల్లారి ద్వారారెడ్డి ప్రకటనలో కోరారు. రూ.2 లక్షల హెల్త్ కవరేజ్ కోసం రూ.3 వేలు, రూ.3 లక్షల కవరేజ్ కోసం రూ.4,700 చెల్లించాల్సి ఉంటుందన్నారు. 70ఏళ్ల లోపు వయసున్న న్యాయవాదులు మాత్రమే ఈ పాలసీ తీసుకోవడానికి అర్హులని చెప్పారు. ఈనెల 11వ తేదీ లోపు ప్రీమియం చెల్లించాలని తెలిపారు. వివరాలకు బార్ అసోసియేషన్ కార్యాలయాల్లో సంప్రదించాలని కోరారు.

వికసించిన మే పుష్పాలు



పలమనేరు పట్టణానికి చెందిన ప్రకృతి కన్వీనర్ మల్లిచెట్ల దేవేంద్ర ఇంట్లో మే పుష్పాలు గురువారం విరబూశాయి. ఆయన మాట్లాడుతూ ఏటా మేనెలలో మాత్రమే ఇవి వికసిస్తాయని తెలిపారు. చుట్టుపక్కల వారు దీన్ని ఆసక్తిగా తిలకించారు

-పలమనేరు

వేసవి శిక్షణలో విద్యార్థులకు విజ్ఞానం

చిత్తూరు కలెక్టరేట్ : నగరంలోని తపోవనం పాఠశాలలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాన్ని డీవైఈవో చంద్రశేఖర్ గురువారం పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించేందుకు శిక్షణ శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చిత్రలేఖనం, రంగులు వేయడం, పేపర్ కట్టింగ్‌లను బాపు బాలభవన్ శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా నేర్పిస్తున్నట్లు చెప్పారు. నగరంలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు వేసిన బొమ్మలను డీవైఈవో పరిశీలించి అభినందించారు. ఈ కార్యక్రమంలో బాపు బాలభవన్ సూపరింటెండెంట్ రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులు వేసిన బొమ్మలను తిలకిస్తున్న డీవైఈఓ

వేసవి శిబిరానికి స్పందన

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో బాలిబాలికలకు ఉచితంగా అందిస్తున్న వేసవి శిక్షణా శిబిరానికి స్పందన లభిస్తోంది. యోగా, కథలు చెప్పడం, స్పోకెన్ ఇంగ్లిష్, చెస్ అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి లావణ్య, ఉపగ్రంథాలయాధికారి గజేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

వసంతాపురంలో14 నుంచి మహాభారత ఉత్సవాలు

గుడిపాల: మండలంలోని వసంతాపురంలో ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో ఈ ఏడాది మహాభారత ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఆలయ అభివృద్ధి కమిటీ ఏర్పా ట్లు ముమ్మరం చేసింది. ఈ ఉత్సవాలకు 34 ఏళ్లు పూర్తయ్యాయని, ఇప్పుడు 35వ మహాభా రతం నిర్వహించనున్నట్లు తెలిపారు. మే 14వ తేదీ నుంచి 31వ తేదీ వరకు మహాభారతం ఉంటుందని కమిటీ మెంబర్లు చెప్పారు. భాగవతారిణి నాగరత్న 18 రోజులపాటు మహాభారత యజ్ఞం హరికథలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మే 21వ తేదీ నుంచి 31వ తేదీ వరకు శ్రీ కృష్ణార్జున కళానాట్యమండలి తిరుపతి మునిశంకర్, గుణశేఖర్ వారిచే నాటకం ప్రదర్శించనున్నారు.